
'ఆటా' కథల పోటీల్లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

-వియోగి



# ఏ తీగ పువ్వో

"కిషోర్ నీతో కొంచెం మాట్లాడాలి."

వెళ్ళిపోతున్న కిషోర్, సారు చంద్రశేఖర్ మాటలు విని ఆగాడు. అనాసక్తంగా వచ్చి అతని ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

"మీరు ఫ్రీనేగా- లేకపోతే కాసేపు ఆగి రండి."

"చెప్పండి సార్!"

"ఏంటి...మీరు ఈమధ్య బాగా దూసుకుపోతున్నారు."

"అంటే..."

"అదే... తగ్గిపోతున్నారు."

"మీరనేది...".

"ఆ! మీ వెయిట్ చూసుకున్నారా?"

"లేదు... కాని యాభై అయిదు కేజీలు ఉండచ్చు."

"ఓ నెల రోజుల్లో కనీసం ఓ ఐదు కిలోలు బరువు తగ్గి ఉంటారని అనుకుంటున్నాను."

"ఈజిట్!" ఓ వెర్రి నవ్వు నవ్వాడు కిషోర్.

"అది కాదు- ఎనీ ప్రాబ్లం! అఫ్‌కోర్స్, ఆఫీసులో వర్క్ ఎక్కువగానే ఉంది. కాని అది కారణం కాదనుకుంటాను." చంద్రశేఖర్ గుర్చి చూస్తూ అడిగాడు.

"వస్తాను సార్... కష్టమరు వెయిట్ చేస్తున్నాడు".

"చూడండి కిషోర్... మీకేమన్నా పర్సనల్ ప్రాబ్లం ఉండి మీ అంతట మీరు సాల్వ్ చేసుకోలేకపోతే మా సహాయం కోరుకునేటట్లయితే ... నేను రెడీగా ఉన్నాను. నిదానంగా చెప్పాడు చంద్రశేఖర్.

"ఓకే సార్... థ్యాంక్యూ!" వచ్చేశాడు.

ఆఫీసరు చంద్రశేఖర్ కిషోర్ కంటే ఓ పదేళ్ళ పెద్దవాడు వయసులో.

ఎంత వద్దనుకున్నా చంద్రశేఖర్‌కు కిషోర్ ఏదో సమస్యలో సతమతమవుతున్నాడని అనిపిస్తున్నది. అతను ఏదో దాచిపెడుతున్నట్లుంది. కాని పర్సనల్ మేటర్సులో మనంతటమనం చొరవ తీసుకోలేం గాబట్టి, అతను బయటపడేదాకా నిరీక్షించడం మంచిదనిపించింది- చంద్రశేఖరుకు.

సార్ ప్రశ్న కిషోర్ మనసును తొలిచింది.

కొంతకాలం క్రిందట- కాలనీలో శశిధర్ ఆర్భాటంగా నామకరణ మహోత్సవాన్ని జరిపాడు. బారసాలలో బాబు పేరు శ్రీచరణ్ అని పెట్టాడు.

కిషోర్ భార్య కిరణ్మయి బాబును ఎత్తుకోబోయింది. అదే సమయానికి వచ్చిన శశిధర్ భార్య సారిక గబగబ బాబును ఎత్తుకుని దూరంగా తీసుకుపోయింది.

ఆమె ఏమీ అనకపోయినా- బాడీ లాంగ్వేజ్ వలన కిరణ్మయి సారిక అభిప్రాయాన్ని అర్థం చేసుకుంది.

"గొడ్రాలువు- నువ్వు తాకితే నా బిడ్డకు ఏం అనర్థం జరుగుతుందో!" అన్న భావన ఆమెకు కలిగింది.

ఆ రాత్రి కిరణ్మయి నిద్రపోలేదు. ఏడ్చి ఏడ్చి కళ్ళు కాయలు కాచాయి. కిషోర్‌ను కూడ నిద్రపోనివ్వకుండా చెవిలో ఇల్లు కట్టుకుని పోరాడింది.

సరిగ్గా అప్పటినుంచి కిషోర్‌కు కష్టాలు మొదలయ్యాయి. ఏ జంటకు ఎప్పుడు పెళ్ళయింది -వాళ్ళకు ఎప్పుడు పిల్లలు పుట్టారు అన్న విషయ సేకరణ మొదలెట్టింది కిరణ్మయి. అంతటితో ఊరుకోకుండా అటు ఏడు తరాలు- ఇటు ఏడు తరాలలో ఎవరికి సంతానం కలుగలేదో ఒక నిఘంటువు తయారుచేసుకుంది.

"మీ వంశంలోనే పిల్లలు సరిగా పుట్టరు." ఓరోజు తేల్చి చెప్పింది కిరణ్మయి.

"అదేం లేదే- మనకు తప్పించి అందరికీ పుట్టారు. అంటే లోపం బహుశ నీలో కాని- నీ వంశంలో కాని ఉండాలి" ఉద్రేకపడ్డాడు.

అది కోల్డువార్‌కు నాందీ అయింది.

ఆమె మనశ్శాంతి లేకుండా చేస్తున్నది. పోను...పోను... "మీకేం మీరు మగవారు- పేరంటాలకు పబ్బాలకు ఎవరు పిలవరు. కాని నేను ఆడదాన్ని. నలుగురిళ్ళకు పోయిరావలసిన దాన్ని. అందరూ విమర్శించే వాళ్ళే- పెళ్ళయి ఐదేళ్ళయినా ఒక్క కాయా కాయలేదని ఎగతాళి చేసే వాళ్ళే!" ఏడ్చేసింది.

"అఫ్‌కోర్సు... కాని... సంతానం అన్నది భగవంతుడు ఇవ్వాల్సిన వరం- మనం అనుకుంటే పుట్టరు." గంభీరంగా చెప్పాడు.

"మీరు మరీ చాదస్తం! ఈ కాలం నేను ఇలాంటి జవాబు యిస్తే నలుగురు నవ్వుతారు." కిరణ్మయి ఖండించి వేసింది.

అలా డాక్టర్ల చుట్టూ తిరగడం ప్రారంభించారు. ఊళ్ళో ఉన్న గైనకాలజిస్టులను సంప్రదించారు. ఏవో టెస్టులని డబ్బులు వదిలించారు. వాళ్ళ అనుమానంకొద్దీ కొన్ని ఖరీదైన మందులు రాసిచ్చారు. అవి వాడితే లేని రోగాలు కొన్ని వచ్చాయి!

ఆరోగ్యంగా ఉన్న మనుషులు శవాల్లాగా వ్రేలాడిపోయారు, జీవశక్తి నశించిపోయింది.

దాంతో డాక్టరును మార్చడం- మళ్ళీ టెస్టులు- రెడ్డొచ్చె మొదలాడు అన్నట్లు మళ్ళీ మందులు.

డి అండ్ సీ చేయించుకుంది కాని, కిరణ్మయి మటుకు లావయింది- ఎందుకో! దానికి దీనికి సంబంధం లేదన్నారు. కిషోర్,

"మీకేం మీరు మగవారు- పేరంటాలకు పబ్బాలకు ఎవరు పిలవరు. కాని నేను ఆడదాన్ని. నలుగురిళ్ళకు పోయిరావలసినదాన్ని. అందరూ విమర్శించే వాళ్ళే- పెళ్ళయి ఐదేళ్ళయినా ఒక్క కాయా కాయలేదని ఎగతాళి చేసే వాళ్ళే!"

ఆరోజు యింటికి వచ్చేసరికి కిరణ్మయి మొహం ఆనందంతో వెలిగిపోతున్నది. దేనికో టెండరు ఉంది అనుకున్నాడు.

"ఏమండీ- ఈ ప్రకటన చూశారా! సంతానం లేని వారికి శుభవార్తట! పిల్లలు గ్యారంటీట! కోర్సు పెద్ద ఖరీదు కాదుట!" ఓ పత్రికలో ప్రకటన చూపించింది.

"ఆహా! అల్లోపతి అయింది - ఇప్పుడు హోమియోపతికి వచ్చావా!" అన్నాడు.

"ఏదో పతి- మనకి కావలిసింది పిల్లలు."

తిరిగి వారం రోజుల్లో ఆ మందులు వాడటం మొదలెట్టారు. అదేం ఖర్మో కాని చిన్ననాటి జబ్బులు తిరగబెట్టసాగాయి. వాటికి ఇంగ్లీషు డాక్టరు దగ్గరకు పోవడం- ఆయన నాటు వైద్యం ఎందుకు వాడుతున్నారని కసురుకోవడం జరుగుతున్నది.

ఇంకో రోజు పేపర్లో ఫలానా సంతాన వైద్యులు క్యాంప్ మీద వచ్చారని కనిపించింది- ఇంక పోయేదాక ఆమె ప్రాణం తీసింది. కష్టపడి అతని లాడ్జి రూము వెతుక్కుంటూ వెళితే- ఆయన నాడి చూశారు, ఇంకే రిపోర్టులు చూడకుండా.

చివరికి "మీకు సంతానం గ్యారంటీ! మూడునెలలు మందు తినాలి- నెలకు పదిహేను వందలు నా ఫీజు, మందుల ఖర్చు!" అని తేల్చి చెప్పాడు ఆ వైద్య శిఖామణి.

"గ్యారంటీ అంటే- డబ్బు వాపసా" అడిగాడు.

"లేదు... సగం వాపసు... పుడితే రెట్టింపు యివ్వరుగా- దీంతోనే సరిపెట్టుకుంటారుగా-" నవ్వాడు.

పిల్లలు కూడా ఖరీదన్నమాట! అనుకుని ఆ మందులు తినడం మొదలెట్టారు శ్రద్ధగా.

ఓ నెలరోజుల్లో ఏ ప్యాంటూ, షర్టూ పట్టకుండా చిక్కిపోయాయి. కిరణ్మయి జాకెట్లు పిగిలిపోయాయి. టైలర్ కొలతలు టోటల్‌గా మారిపోయాయి- యిద్దరికీ!

మూడు నెలల తర్వాత సంతానం కలుగలేదు కాని- బరువు ఎలా తగ్గాలన్నా సమస్య చుట్టుకుంది. కిరణ్మయిని కిషోర్‌ను చూసిన వాళ్ళంతా కామెంట్ చేసేవాళ్ళే!

ఒబేసిటీ క్లినిక్‌ల చుట్టూ తిరుగుతున్నారు. ఆరు నెలలు గడిచినా ఉపయోగం లేదు. ఓ రోజు కిషోర్ పరధ్యానంగా ఉంటే చంద్రశేఖర్ అడిగాడు.

"కిషోర్ ఈమధ్యన మీ వర్క్‌లో తప్పులు దొర్లుతున్నాయి. ఎనీ ప్రాబ్లం?" అతన్ని దగ్గరికి పిలిచి మృదువుగా అడిగాడు.

"ఉన్నా- ఆర్చేవాళ్ళు ఎవరు. తీర్చేవాళ్ళు ఎవరు?" డీలా పడిపోయి అన్నాడు.

"ఎందుకు అలా అనుకుంటావు- మాకు చేతనైన సహాయం చేస్తాం!" చెప్పాడు.

కిషోర్ తన సమస్య వివరించాడు.

"సిల్లీ! హైదరాబాదులో సంతాన సాఫల్య కేంద్రాలు కొల్లలున్నాయి. అక్కడికిపోయి ప్రయత్నించండి- ఇంకా చిన్నవారు వయసు మీరిపోలేదు." ధైర్యం చెప్పాడు చంద్రశేఖర్.

కిషోర్ కిరణ్మయికి చెప్పాడు సారు చెప్పిందాన్ని. "ఈ మందులు తిని తిని విసుగు వస్తున్నది- పిల్లలు పుట్టకపోతే ఒకటే సమస్య- ఈ డాక్టర్ల దగ్గరికిపోతే అన్నీ సమస్యలే. ముందు పర్సు చిల్లి పడుతుంది. ఒళ్ళు గుల్లవుతుంది." నిరాశగా చెప్పింది. మూతికాలిన పిల్లి పాలకు భయపడినట్లు భయపడుతున్నది ఆమె.

"కిరణ్! ఈ ఒక్కసారి ట్రై చేద్దాం. ఆ తర్వాత భగవంతుడి దయ, మన ప్రాప్తం!" చెప్పాడు. వీలు చూసుకుని- హైద్రాబాద్ చేరుకుని- మళ్ళీ డాక్టర్లు- టెస్టులు- వగైరాలు చేయించారు వారంరోజులు తిష్టవేసి. ఏవో ట్యూబులు మూసుకుపోయాయి- ఆపరేషన్ చేయాలన్నారు కిరణ్మయికి. ఇంకా ఏవో చెప్పారు. అలాగే కిషోర్‌కు కూడా కొన్ని మందులు ఇవ్వాలన్నారు.

ఆ ఖర్చు చూస్తేనే గుండె పగిలిపోయింది ఇద్దరికి.

కొంత బంగారం అమ్ముకుని- ఆపరేషన్ కాస్త చేయించాడు. వాళ్ళు ఎన్నెన్నో మందులు రాసిచ్చారు- ఎన్నెన్నో నియమాలు చెప్పారు.

ఓ ఆరు నెలలు ఎంతో ఉత్సాహంగా- ఆశతో బ్రతికేశారు. కాని చివరికి మాములే! వాళ్ళ నిరాశ నిస్పృహలు ఇద్దరిని చుట్టుముట్టాయి.

"కిషోర్! ఈరోజు మా యింట్లో చిన్న పార్టీ యిస్తున్నాను మీ మిసెస్‌ను తీసుకుని తప్పకుండా రావాలి!" చంద్రశేఖర్ ఆహ్వానించాడు- రహస్యంగా.

"మా ఆవిడకు ఇలాంటివి ఇష్టం ఉండదు- నే వస్తాలేండి. తను నలుగురులో కలవాలంటే సిగ్గుపడుతుంది."

"అదేంటి! పరాయివాళ్ళు ఎవరూ రావడం లేదు ఓన్లీ వెరీ లిమిటెడ్ సర్కిల్" చెప్పాడు మొండిగా చంద్రశేఖర్.

ఆయన చెప్పినట్లు ఓ పది మంది మటుకే వచ్చారు. ఐదు జంటలు అంతే! డాబాపైనన వెన్నెల్లో బఫే మీల్సు అరేంజ్ చేశాడు. ఎవరికివాళ్ళు వడ్డించుకుని కుర్చీల్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ తినడం! తమాషాగా ఉంది.

"బై ది బై! ఈయన రాఘవరావు! ఇంజనీరు ఆయన మిసెస్ జానకి మంచి ఆదర్శ జంట!" చంద్రశేఖర్ పరిచయం చేశాడు- ఒక ముచ్చటైన జంటని.

పరస్పర పరిచయాలు అయ్యాయి.

కిరణ్మయి జానకితో యిట్టే కల్సిపోయింది.

జానకి భుజాన ఉన్న చిన్న పాప మీన కిరణ్మయికి బాగా నచ్చింది. ఆ పాపను తను ఆడిస్తూ తిప్పింది చాలా సేపు.

"ఫ్రెండ్సు... వచ్చేనెల నేను ట్రాన్సుఫరై వెళ్ళిపోతున్నాను. మళ్ళీ మనం కల్సుకుంటామో లేదోనని యిచ్చాను" చంద్రశేఖర్ చెప్పాడు. అందరూ బాధపడ్డారు. ఉండాలని కోరుకున్నారు. విఠల్- చంద్రశేఖర్ బాబు- పదేళ్ళవాడు- కెమెరా పట్టుకొని తెగ హడావిడి చేశాడు ఫొటోలు తీస్తానంటూ వద్దన్నా వినకుండా అందర్నీ నించోపెట్టి- కూర్చోపెట్టి కలిపి విడిగా రకరకాల భంగిమల్లో తీశాడు.

కాసేపటికి కబుర్లు- ఆడవాళ్ళ మధ్య, పిల్లల మీద, పిల్లల చదువుల మీదకి సాగిపోయాయి.

"మీ పిల్లల్ని కూడా తీసుకువస్తే బాగుండేది." జానకి అడిగింది.

"సారీ.. పిల్లలు లేరు" చంద్రశేఖర్ చెప్పాడు.

"పెళ్ళయి ఎన్నేళ్ళయింది?" బులెట్లాంటి ప్రశ్న వచ్చింది.

ఇంక అలా కొనసాగింది కిరణ్మయిమీద ప్రశ్నల పరంపర.

"పాపం! పిల్లలు పుట్టలేదుట!" సింపతితో ఆగిపోయింది.

అప్పటినుండి ఆమెకు ముళ్ళమీద ఉన్నట్లు అయింది. తల తిరుగుతున్నట్లు అనిపించింది. ఒళ్ళు తూలింది.



"లేని దానికోసం ఆరాటపడి బాధపడి జీవితాలను దుఃఖమయం చేసుకునే కంటే- ఉన్నదాన్ని- అందు బాటులో ఉన్నదాన్ని- అందుకుని సంతృప్తిపడి జీవితాలను ఆనంద మయం చేసుకునేవాడు ధన్యుడు"

చంద్రశేఖర్ భార్య హిమబిందు ఆవిడను లోపలికి తీసుకుపోయి- ఒక సోఫాలో పడుకోబెట్టింది. కూలర్ ఆన్ చేసింది.

అరగంట తర్వాత- కిషోర్ కిరణ్మయిలు కూడా వెళతామని లేచారు. హిమబిందు రవికలగుడ్డ పెట్టింది- కిరణ్మయికి.

"కిషోర్! ఒక్క మాట! రాఘవరావు- జానకిల జంట ఎలా ఉంది?" చంద్రశేఖర్.

"ఓ సూపర్! చక్కగా ఉన్నారు." చెప్పాడు.

"వాళ్ళ పాప వండర్‌ఫుల్‌గా ఉంది." చెప్పింది కిరణ్మయి.

"నిజం చెబితే ఆశ్చర్యపోతారు" హిమబిందు చెప్పింది.

"ఏం నిజం!?" కుతూహలంగా అడిగింది కిరణ్మయి.

"వారికి సంతానం లేదు." చంద్రశేఖర్ చెప్పాడు.

"మరి- ఆ పాప!" కిరణ్మయి ఆశ్చర్యపోయింది.

"ఒక అనాధాశ్రమంనుండి తెచ్చుకుని పెంచుకుంటున్నారు. రోజుల బిడ్డను తెచ్చుకుని పెంచుకుంటున్నారు మీలాగే వాళ్ళు పిల్లలు పుట్టలేదని బాధపడ్డారు. తర్వాత సర్దిచెప్పుకుని ఒక అనాధ పాపను తమ పాపగా స్వీకరించి పెంచుకుంటున్నారు." చంద్రశేఖర్ చెప్పాడు.

కిషోర్ మాట్లాడలేకపోయాడు- కిరణ్మయి నిశ్చేష్టురాలైంది.

"మన తల్లో పెట్టుకునే పువ్వు మన తలకి పూయదు- మనం ధరించే దుస్తులు మనం తయారు చెయ్యం- మనం కట్టుకోం! ఆఖరికి మనం ఉండే ఇల్లు మనది కాదు-అంటే మనం మన చేతులతో కట్టలేం!" హిమబిందు చెప్పింది.

"కాని- ఆ పూవును అలంకరించుకోవడానికి మనకు ఏ అభ్యంతరము లేదు ఆ దుస్తులు ధరించడానికి మనకు సంకోచం లేదు. ఆ ఇంటిలో ఉండటానికి గర్వపడతాం!" చంద్రశేఖర్ చెప్పాడు.

"కాని బిడ్డలు మటుకు మన గర్భంలోనే మోసి మనం కంటేనే స్వంత బిడ్డలనుకుంటాం! పరాయి బిడ్డలను దత్తతకు తీసుకుని పెంచుకోవడానికి మన సంస్కారం ఒప్పుకోదు" హిమబిందు చెప్పింది భారంగా!

"మనది కాని దానితో మనం ఆనందపడుతున్నప్పుడు, పరాయి వస్తువులతో సుఖపడుతున్నప్పుడు, పిల్లలు లేరని బాధపడేకంటే, వద్దనుకునే వారినించి స్వీకరించి పెంచుకోవచ్చుగా!" చంద్రశేఖర్ అడిగాడు.

ఆ ప్రశ్న కిషోర్ కిరణ్మయి గుండెల్ని తాకింది సూటిగా...

"సుపుత్రుడు కావాలి అనుకునే రోజులు పోయాయి. సుపుత్రిక అయినా చాలనుకున్నారు రాఘవరావు వాళ్ళు" హిమబిందు చెప్పింది- వాళ్లు అమ్మాయిని తెచ్చుకుని పెంచుకోవడం గుర్తుచేసుకుని.

"లేని దానికోసం ఆరాటపడి బాధపడి జీవితాలను దుఃఖమయం చేసుకునే కంటే- ఉన్నదాన్ని- అందుబాటులో ఉన్నదాన్ని- అందుకుని సంతృప్తిపడి జీవితాలను ఆనందమయం చేసుకునేవాడు ధన్యుడు" చంద్రశేఖర్ చెప్పాడు.

కిషోర్- కిరణ్మయిలకు ఎక్కడో వెలుగు కనిపిస్తున్నది.

★